# అంబ పలుకు... జగదంబా పలుకూ!

'గూ గుగ్ గుగ్ గూ, గూ గుగ్ గుగ్ గూ'

మీరెప్పుడైనా తొండ మండలం వెళ్ళారా? వెళ్ళి వుండరు. వెళ్ళడానికదేమైనా కాశి, గయ, కంచి, రామేశ్వరంలాంటి పుణ్యక్షేత్రమా? పుణ్యక్షేత్రమైనా అందరూ వెళ్ళాలని ఎక్కడుంది? దాదాపుగా ఒక వెయ్యి కడపలున్న తొండ మండలానికి ఆ వూరి వాళ్ళ బంధువులు, మిత్రులు, వ్యాపార సంబంధమైన లావాదేవీల పైన వెళ్ళేవారు, యింకా తదితర కార్యాలపైన వెళ్ళేవారు వుంటేగింటే వందలు దాటి వేల సంఖ్యలో వుండొచ్చు.

అలా వెళ్ళిన వారిలో ఎవరైనా కొన్ని రాత్రులక్కడ వుండి, అర్ధరాత్రిదాటిన తర్వాత, ఏ ఒకటి ఒకటిన్నరా ప్రాంతంలోనే మేలుకుని వున్నట్టయితే ఆ రాయి రాయీ కరిగేవేళ,

– గుండెల్లో గుబులు పుట్టిస్తూ
మనసులో దిగులు తెరచాపలు దించుతూ
కాలపురుషుడు గూబదాకా లాగి వదిలి పెట్టిన విషబాణంలా
గ్రామ దేవత పళ్ళు పట పట కొరుకుతూ ఉచ్చరించే క్రూర శాపంలా
'గూ గుగ్ గుగ్ గూ' అంటూ
సన్నటి, సుదీర్ఘమైన, కర్ణశూలంలాంటి ఎలుగు ఒకటి
వినిపించి వుంటుంది
అది ఏ పక్షి కూత? లేదా ఎవరి తలరాత?
అవధరించండి, అదే ఈ కత:

పాతికేళ్ళ క్రితం ఒకనాటి రాత్రి తొలిజాము యింకా సగంలోనే వుంది. రైలు పట్టాల కవతల వున్న థియేటర్లో ఇంటర్వెల్ కోసం వెలుపలికి వచ్చిన ప్రేక్షకులు తిరిగి లోపలికి వెళ్తున్నారు. పడమటి నుంచి తూర్పుకు వెళ్లే రైలు మూడు గంటలు ఆలస్యంగా నడుస్తుండడం వల్ల ప్రయాణీకులు ప్లాట్‌ఫారం పైన పడిగాపులు పడుతున్నారు. ఊరంతా దీపాలు వెలుగుతూనే ఉన్నప్పటికీ, కరెంటు కొరత ఉన్నకాలం గనుక అవి ఉన్నాలేనట్టే వెలవెల పోతున్నాయి. స్టేషనుకావల ఊరికంతా నడిబొడ్డుగా వున్న సంత మైదానంలో పూలు, పండ్లు, బీడాలు, సోడాలు జోరుగా అమ్మకమైపోతున్నాయి. ఈ సంరంభంతో సంబంధ మేమీ లేకుండా ప్లాట్‌ఫారం చివర, తూర్పు వైపు కేబిన్‌కు వెనుక వైపున, సగందాకా గోడలులేక ఖాళీగా ఉన్న గూడ్స్‌షెడ్‌లో కొందరు బిచ్చగాళ్ళతో బాటు కొన్ని బికారి కుటుంబాలు గూడా బసచేసి ఉన్నాయి. పూసలు, దండలు, పిన్నీసులు, పౌడరు డబ్బీలు అమ్ముకుంటూ ఊళ్ళు తిరిగే సుగాలీ దంపతుల్లో భర్త ఓ మూటకు చేరగిలబడి బీడీ కాలుస్తుండగా, భార్య మూడు రాళ్ళ పొయ్యి మీద వంట ప్రయత్నాలు మొదలెట్టింది. ఒకరికొకరు తోడుగా నీడగా మిగిలిన ముదుసలి ఆలుమగలు గిన్నెలో మిగిలిన సంగటో, సలిబిండో తిన్న శాస్త్రం ముగించి, అప్పుడే బొంత వేసుకున్నారు. పిచ్చిగుంట్ల వాళ్ల కుటుంబాలలోని ఆడంగులు పిల్లలకోళ్ళకు మల్లే అటూ ఇటూ తిరుగుతూ, తమ మగవాళ్ళు తరిమి తరిమి పట్టుకొచ్చిన ఉడతల్ని కాల్చి, కైమా చేసి, ఉప్పూ కారం వేసి ఉడకబెట్టి, గర్మసాలా తిరగమోతలో గుమ్మెత్తించేస్తున్నారు. ఆ బికారి జనుల మినీ ప్రపంచానికి

అనధికార తాత్కాలిక ప్రభువులా తలా గడ్డమూ గూడా రెల్లుపొదలా పండిపోయిన ఓ ముసలి బైరాగి షెడ్డుమధ్య పద్మాసనం వేసుకుని నిటారుగా కూచున్నాడు. ఒడిలో తంబురా. వేలు తీగను ఒక స్థిర స్థాయిలో, క్రమవ్యవధిలో 'ట్రింగ్ ట్రింగ్' అంటూ మీటుతోంది. ఆ నాదానికి అనుగుణ్యంగా పెదవులు కదులుతున్నాయి. అది పాటో, మంత్రమో పైకి వినిపించడం లేదు.

ఈలోగా సుగాలీ ఆవిడ పొయిమీద బెట్టిన అన్నం దేగిసాలో పొంగొచ్చేసింది. పిచ్చిగుంట్ల వాళ్ళ పిల్లలు ఆవురావురుమంటూ గిన్నె లెత్తుకున్నారు. ఊరిపైన ఆడుక్కోడానికి వెళ్ళిన ఒంటరి బిచ్చగాళ్ళు ఒక్కొక్కరుగా వచ్చి మెట్లపైన, కానుగచెట్ల క్రింద, రాతి బెంచీలపైన ఎక్కడ బడితే అక్కడ పడుకున్నారు. తూర్పువెళ్ళే రైలు అనుకున్న దానికంటే అరగంట ఆలస్యంగా వచ్చి అప్పుడే స్టేషనులో ఆగింది. ఆ సమయానికి సరిగ్గా గూడ్సుషెడ్ మెట్లపైన్నుంచీ పాత చడావుల చప్పుడు కిర్రు కిర్రు మంటూ వినిపించింది.

బైరాగి కళ్ళు తెరిచాడు.

ఆగంతుకుడికి యాభై యేళ్ళుండొచ్చు. సన్నగా, పొడుగ్గా, కొంచెం గూనిపోవడం వల్ల వింటిదబ్బలా ఉన్నాడు. పరిమాణంలో తలకు మించిన తలగుడ్డ చుట్టాడు. దట్టమైన కనుబొమ్మలు, కోరమీసాలు, నెలరోజుల దుబ్బు గడ్డం అతడి ముఖంలో చాలా భాగాన్ని కమ్మేశాయి. నుదుట కుంకుమ బొట్టు. మినుగురుల్లాంటి చిన్న కళ్ళు. రెండు కాళ్ళకూ కవచంలా గట్టిగా చుట్టుకున్న పంచలోని చెంగుల్ని పైకెగదీసి గోచీ పెట్టుకున్నాడు. చొక్కామరీ పాతదయ్యే వుండచ్చు. బాగా చిరుగులు గూడా పడి ఉండొచ్చు. అయితే దాని ఆంతర్యం బయటపడకుండా పైన నల్లటి కోటు వేసుకుని, మిగిలివున్న బొత్తాములు ఒకటో రెండో తగిలించుకున్నాడు. మణికట్టుకు తాయెత్తు, మెడలో నల్లపూసలదండ. ఒకవైపు చంకలో గొడుగు, మరొకవైపు భుజానికి అటూ ఇటూ వేలాడుతూ జోలె. నిండైన ఆహార్యంతో అతడలా వచ్చి నిల్చునేసరికి గూడ్సుషెడ్ అనే రంగస్థలానికే కొత్త సంచలనం వచ్చేసినట్టయింది.

"రా నాయనా! కూచో, ఏ వూరు మంది?" కొత్త పాత్రకు సాదరంగా స్వాగతం చెప్పాడు బైరాగి.

"దండాలు సామీ, దండాలు!" జోలె క్రింద పెట్టి, గొడుగును గూడా దానికానించి, శుకుని యెదుట శౌనకుడిలా ఎంతో భయభక్తులతో బైరాగి ముందర కూర్చుంటూ వచ్చిన వ్యక్తి కొనసాగించాడు "మాది కర్నూలు జిల్లా కోయిల కుంట్ల దెగ్గిర. మా వూరి పేరు బ్రెమ్మంగుండం. మావూళ్లో ఒక నూరిండ్ల దాకా మావోల్లే. మేం మా వూళ్లోనే మా యిండ్ల దెగ్గిరుండేది సమ్మత్సరంలో మూణ్ణెల్లే! మిగతా తొమ్మిది నెల్లూ ఇట్లా దేశంపైన బడి తిరగడమే. రాముణ్ణి, రాజ్జాన్ని నమ్ముకొని బతికేటోల్లం సామీ, బుడబుడకలోల్లం! నా పేరు మల్లన్న. బుడబుడకల మల్లన్న అంటారు...."

"అట్లనా నాయనా! ఈ వూరెప్పుడొస్తివి?"

"పొద్దుండగానే వొస్తి. వూరంతా నొకసారి తిరిగి చూస్తి. బుడబుడకలోల్ల సంగతి తమకు తెలియందా సామీ! తెల్లారేసరికి ఒక జాము ఎనకాముందే మేము గ్రామ సంచారం చేసేది. సిక్కటి సీకట్లో బయల్దేరాల్సిన పని. వూళ్ళో మత్తేబు లేపక్కన వుండారో, గరీబు లేపక్కనుండారో తెలిసిపెట్టుకోవల్ల రాజుల ఇండ్లు ఉండేదెక్కడ్నో, రైతుల యిండ్లు వుండేదెక్కడ్నో, యాపారస్తుల యిండ్లు వుండేదెక్కడ్నో, కణిషించి పెట్టుకోవల్ల. ఒక సోలెడు

బియ్యం, ఒక పావలా డబ్బు, ఒక పాత్రొస్త్రం ఏడ దొరకతాదో, ఆ యిల్లు కనిపెట్టుకుంటేనే సామీ, మాకు బతుకు..."

"మంచిది నాయనా! ఈ వూరంతా తిరిగి చూస్తివి గద! నీ కేమనిపించింది?"

"వూరొకటే అయినా ఇందులో దిగువూరనీ, ఎగవూరనీ రెండుండాయి సామీ! గనిమల్లో ఎలిక బొరికల మాదిరిగా దిగవూరంతా సందులూ, గొందులే! ఆడుండేదంతా బీదా బిక్కీ జనం. కూలీ నాలీ చేసుకుంటూ ఏ పూట కాపూట నూకలు తెచ్చుకునే బాబత్తు. ఊరి మద్దెన బజారుండాది. శానా పెద్దదే. ముందుగా అంగల్లుంటే ఎనకా లెక్కడ్నో ఇండ్లుండాయి. పొద్దెక్కి అంగల్లు తెరిస్తేగానీ ఆడ రూక రాలదు. పోతే దచ్చినంగా ఉండేది కాపువాడ. ఆడ జనం మిగిలి మిట్టన బడినోల్లేంగాదు. అన్నీ సుమారు పాటి సంసారాలు. అయినా నోటితో లేదనేది చేత్తో లేదనకుండా అంతో ఇంతో యిదిలించే వాళ్ళుగానే వుండారు. ఇకబోతే వూరికి ఉత్తరంగా పెద్ద పారిగోడల మద్దెన బ్రెమ్మాండమైన రెండంతస్తుల బవంతీ ఒకటుండాదే సామీ, దాన్నీ వూళ్ళో గుండప్ప మాడీ అంటారంట! గుండప్ప అనే ఆయన అయితే ఎప్పుడో పోయినాడుగానీ ఆయన కొడుకులు ముగ్గురో నలుగురో వుండారంట! ఆల్లకు యిక్కడ్నేగాదు, పట్నంలో కూడా యిండ్లు, కాపరాలు వుండాయంట! ఆ లోగిట్లో తోటా దొడ్డీ, ఆవులూ, ఎద్దులూ, ట్రాకటర్లు, పనిమనుషులు, మోటార్లు, ఇస్కూటర్లు - ఓ యబ్బో, సెప్పతరం గాదు వయికుంఠం! వయికుంఠం అంటే ఎక్కడ్నో వుండాదనుకుంటాం గానీ సామీ, ఆ గుండప్ప మాడీయే వయికుంఠమనుకోండి! ఆల్లు ఆడోళ్ళు గాదు, దేవతా స్త్రీలు! ఆల్లు బిడ్డలు గాదు, అపరంజి బొమ్మలు! అది సంసారం గాదు. పాలసముద్రం! ఎందుకులెండి! చూసేదానికి ఎయ్యి కండ్లు గావాల. ఆడుండే మారాజుల్లో ఒక మారాజు తల్చుకుంటే సాలదా సామీ, నెల్రోజుల సంపాదన నా జోల్లో పడినట్టే!"

బైరాగి కింది పెదవితో పై పెదవిని బిగించాడు. నుదురు కుంచించాడు. కళ్ళు చికిలించాడు. అప్రియమైనా సత్యం చెప్పక తప్పని యిబ్బంది నుంచీ బయట పడలేక గిలగిలలాడిపోయాడు. అయినా చెప్పేశాడు:

"నాయనా, మల్లన్నా! నేనొక మాట సెప్తా, యింటావా?"

"అయ్యో సెప్పండి సామీ!"

"నువు కాపువాడ కెళ్ళు, వాళ్ళు తృణమే యిచ్చినా, పణమే ఇచ్చినా సంతోషంగా చెయి పట్టు. బజారుకెళ్ళు, నీ అదురుష్టం బాగుంది పది దొరికినా, ఇరవై దొరికినా జేబులో యేసుకో. ఆఖరుకు దిగవూరికి గూడా ఎళ్ళు. వాళ్ళు పైసలే ఇచ్చినా, అదే పది వేలనుకో! కానీ ఎట్టి పరిస్థితిలోనూ గుండప్ప మహిడి పక్కకు మాత్రం ఎళ్ళొద్దు. ఆ సాయలకైనా తొంగి సూడొద్దు."

బైరాగికేసి అనుమానంగా చూస్తూ అడిగాడు మల్లన్న "ఏంది సామీ? మీరు సెప్పేదాంట్లో ఇవరమేమీ తెలీటం లేదే?"

"అదంతేలే నాయనా! పిల్లికి బిచ్చం పెట్టరనీ, తెగిన వేలికి సున్నం వెయ్యరనీ, కడుపు చించుకున్నా గారడీ విద్యే నంటారనీ కొందర్ని గురించి చెప్పుకోడం నువ్వు విన్లేదా? అటువంటివాళ్ళు కొందరు అంతా ఒక ఇంటి మొదులేలే తమకు లోకం కనిపించకుండా, లోకానికి తాము కనిపించకుండా తమ లోగిలి చుట్టూ పెద్ద పహరీ గోడలు పెట్టుకున్నారు. అదే మహిడీ కాంపవుండు..."

"అయితే మాత్రం?"

"నాయనా! తమ పాయిదాకు తగ్గిన మనుషులంటే వాళ్ళకు పురుగుల్తో సమానం. మరీ సన్నకారు జనమంటే తమ పాదాల కాడ పడుండే చెత్తకంటే హీనం. ఉండేందు కిల్లులేక, తినేందుకు తిండిలేక, కట్టేందుకు గుడ్డలేక ఈ నిర్భాగ్గి ముండాకొడుకు లెందుకు బతకతారో వాళ్ళకర్థం గాదు. మొత్తానికి ఆ గోడల్లోపల ఉండేది అదొక రాజ్యం. బయటుండేది ఇదొక రాజ్యం. ఎవురి రాజ్యంలో వాళ్ళుండేది మంచిది. ఏం మల్లన్నా! నేనేమో చెప్పినాను. తర్వాత నీ ఇష్టం..."

"అయితే, తమరు నా మాట కూడా ఒకటి ఇనుకోవాల సమీ! నేను నిన్న పుట్టి ఈ దినం కండ్లు తెరిచినోడినేమీ గాదు. ముప్పై అయిదేండ్ల నుంచి ఇట్లా దేశంపైన బడి తిరగతానే వుండా. ఆలంపురం నుంచి అనంతపురం దాకా కావలి నుంచి కాలాస్తి దాకా ఈ సుట్టు కైవారంలో నేనడుగుపెట్టని ఊరు లేదు. బడాబడా ఆసాముల్నెందర్నో సూచినాను. ఇయ్యాని మొండోణ్ణి పాలిటికి ఇడవని చండోణ్ణి నేను..." మల్లన్న చెయ్యి అప్రయత్నంగా అతడి కోరమీసం పైకి పోబోయింది. కానీ సందర్భం చటుక్కున స్ఫురణకు రావడంవల్ల ఆ ప్రయత్నం మధ్యలోనే ఆగిపోయింది.

బైరాగిలో ఎంతో కొంత ఓపిక మిగిలే ఉంది. అతడు నెమ్మదిగా కొనసాగించాడు "సరే నాయనా! నువు దేశం చూసినోడివే. నేను కాదనను, అయితే, కాయలాపడి రెండు రోజులు పనికిరాని సేద్యగాణ్ణి చెట్టుకు కట్టించి, పొట్టులేచి పొయ్యేటట్టుగా చింతబరికలతో కొట్టినవాళ్ళని నువ్వు చూసివుండవు. దారంట వెళ్ళే దానయ్య ఒకడు తోటలో ఒక కాయ కోసుకున్న నేరానికి తల గొరిగించి, అదే మామిడి పిందెల దండ మెడలో వేయించి చుట్టు పక్కల పదూళ్ళు మెరవణి దిప్పించిన వాళ్ళని నువు జూచి ఉండవు. మడిలో మందబెట్టడం ఆలస్యమైందని గొర్రెల్నీ, పొట్టేళ్ళనీ ఒక రాత్రంతా అడుసు మడిలో నిలబెట్టి తెల్లారే వేళకు అవి నీలిగిచస్తే మీసం మెలేసిన వాళ్ళని నువు జూచి ఉండవు. బడిలో అల్లరి చేసిన పిల్లకాయను దండించినందుకు అయ్యవార్ని ఇంటికి పిలిపించి పొద్దు పడమటికి వాలేదాకా నిలువుగాళ్ళ శిక్షేసినవాళ్ళని నువు జూచి ఉండవు. ఇంతకు ముందు దేవతా స్త్రీలంటివే, అటువంటివాళ్ళు ఇండ్లల్లో మగ్గతావుంటే పట్నంలో బజారు సరుకుతో కులికేవాళ్ళను నువు జూచి ఉండవు. అంతెందుకు? ఎలక్షనులో నిలబడితే కట్టుకున్న పెండ్లాంగూడా ఎవళ్ళకు వోటెయ్యాదో వాళ్ళను నువు జూచి ఉండవు. చూడు మల్లన్నా, నిప్పులో వేలు పెట్టొద్దు అంటాం. పెడితే నేమని నువ్వంటావు. వేలు కాలుతుంది అంటాం. కాలితేనేమి అని నువ్వంటావు. ఆ మాటకు మాత్రం జవాబుండదు..."

తలవంచుకొని బైరాగి మాటల్ని మననం చేసుకుంటూ కూర్చున్న మల్లన్న కొద్ది నిమిషాల తర్వాత మెల్లగా పైకి లేచాడు. జోలెలో మంచి గోతంపట్ట తీసిపరచుగుని దానిపైన సాపుగా పడుకున్నాడు. కొంతసేపలా పడుకున్నాక కళ్ళు దెరిచి మళ్ళీ బైరాగివైపు చూశాడు.

"ఏమి?" అన్నాడు బైరాగి.

"ఏం లేదు సామీ! నేనొక మాట సెప్తే మీరు కోపగించుకోవద్దు. నిప్పును తాకకుండా దాంతో బీడీ ముట్టించుకోవడం నాచేతనవును..."

బైరాగి నవ్వాడు. నవ్వుతూ అన్నాడు:

"అట్లనా నాయనా! మంచిది, మంచిది."

* * *

"అంబ పలుకు, జగదంబా పలుకూ!
కంచిలోని కామాచ్చీ పలుకు
మధురలోని మీనాచ్చీ పలుకూ
కాశీపురిలో కాపురముండే
కన్నతల్లి విశాలాచ్చీ పలుకూ
సత్తెం పలుకు తల్లీ!
శుభం పలుకు తల్లీ...!"

చల్లగా మంచు కురుస్తున్న వేళ. చీకటి అప్పుడప్పుడే విచ్చుకుంటోంది. చెట్లు నిశ్చలంగా వున్నాయి. మేడలో ఒక్క సింహద్వారం తప్పితే మిగిలిన తలుపులు, కిటికీలు బంధించబడే వున్నాయి. భవంతి ముగిట నీళ్ళు చల్లి ముగ్గేస్తున్న ఓ నడి వయసావిడ మల్లన్న చొరవను చూచి కాసేపు నిర్ఘాంత పడిపోయింది. తరువాత వద్దు వద్దన్నట్టుగా చెయ్యి ఊపుతూ ముందుకు పరుగెత్తుకొచ్చింది.

"అయ్యా, బుడబుడకలాయనా! ఓరి నీ చాదస్తం మండా, నోరు ముయ్యవయ్యా ముందు! పెద్దయ్యగారు నిద్రపోతుండారు. నిద్ర పాడయిందో తోలువొలిచేత్తారు. ఎళ్ళిపో. ఈ పక్కన ఎక్కడా ఉండొద్దు. దూరంగా వెళ్ళిపో..."

'ఇటువంటి హెచ్చరికలన్నీ నాకు మామూలే! నన్నడ్డుకునే దెవరు?' అన్నట్టుగా మల్లన్న వెళ్ళి వెళ్ళి సోపానాలపైన్నే నిల్చున్నాడు. లంకంత చుట్టు భవంతి ఇంట్లో అయ్యగారు బహుశా సింహద్వారం ప్రక్కన వున్న గదిలోనే పడుకుని ఉంటారని ఊహించాడు. గొంతు పెంచాడు. పాటలో, మాటలో విరామం వచ్చినప్పుడల్లా బుడబుడక మోగిస్తూ పుంజుకున్నాడు.

"మారాజు లోగిల్లో మాలక్ష్మి కాపురముండాల, అందలం పాలకీల్లో అయిశ్వర్యం యిల్లు జేరాల. పట్టింది బంగారం గావాల. ముట్టింది ముత్యాలపేరు గావాల. తలచింది నడిచిరావాల. సత్తెం పలుకు తల్లీ! శుభం పలుకు తల్లీ! అంబపలుకు, జగదంబా పలుకూ...."

పిడుగు పడినట్టుగా కేక వినిపించింది

"ఒరేయ్, ఎవరక్కడ?"

అంతటి ప్రశాంత ప్రభాత సమయంలో గూడా పనిమనిషి ముఖంలో ముచ్చెమటలు పోసేశాయి. ఆమె గడగడ వణికిపోతూ గుమ్మం దగ్గరికి పరుగెత్తి తలలోపలికి చాస్తూ "అయగారూ, ఎవరో బుడబుడకలోడండీ!" అంది.

"ఏమంట?"

మల్లన్న ఓ మెట్టు పైకెక్కి, కొంగలా మెడ ముందుకు సాచి, పనిమనిషితో రహస్యం చెబుతున్నట్టుగా "పాతొస్త్రం పాతొస్త్రం" అన్నాడు.

ఆమె అందుకుంది, "పాతొస్త్రం కావాలంటండీ?"

"వుండమను! పంపిస్తాను."

మల్లన్న కళ్ళల్లో గర్వం కదనుదొక్కింది. 'చూస్తివా మన దెబ్బ!' అన్నట్టుగా అతడు పనిమనిషి వైపు చూస్తూనే వున్నాడు. 'ఛౌళ్ ఛౌళ్ ఛౌళ్!' మంటూ ఒక భయంకరారావం వినిపించింది. అదేమిటో అర్థం గాక మునుపే ఓ నల్లటి ఆకారం మల్లన్నపైకి దూకింది.

జానెడు పొడుగు నాలుకతో చొంగ కారుస్తూ, మొనదేలిన కోరలు కనిపించేటట్టు భీకరంగా నోరు తెరుచుకుని తలపైకి దూకిందొక మామూలు కుక్క కాదన్న విషయం

మల్లన్నకింకా అంతుపట్టనే లేదు. ఆలోగానే అది ముంగాళ్ళను మల్లన్న నడుముపైన మోపి అతడు మెడకు చుట్టుకున్న అంగవస్త్రాన్ని లాగిపారేసింది.

'చస్తిన్రో నాయినా!' అంటూ మల్లన్న మెట్లపైన్నుంచీ కిందికి దూకాడు. వేటకుక్క లాఘవంగా గాలిలో కెగిరి ఈసారి అతని నడుముపైకి లంఘించింది. నోటికేది దొరికితే దాన్ని చీల్చి పారెయ్యాలన్న తమకంలో వున్న ఆ మూర్ఖ జంతువుకీసారి మల్లన్న భుజానికి తగిలించుకున్న జోలె దొరికింది. దానిలో నుంచీ ఓ మూరెడు గుడ్డ పరాలుమంటూ చిరిగిపోయి కుక్క నోటిలోకి వచ్చేసింది. జోలెలో అటువైపున్న వస్తువులన్నీ చెల్లాచెదురుగా క్రిందపడి పోయాయి.

భుజానికిరువైపులా తగిలించుకున్న జోలె ఒక వైపున ఖాళీ అయిపోవడంతో, ముందువైపు బరువువల్ల దభాలున నేలపైన పడిపోయింది.

దాన్ని చేతికి తీసుకునే ప్రయత్నంలో ఉండగా అతడి కోటు చీలికలు, వాలికలైపోయింది. కోరలు చొక్కాను గూడా చీల్చుకుని వీపుపైన ఎర్రని చారికల్ని ఏర్పరిచాయి. గొడుగూ, తలగుడ్డా ఏమయ్యాయో పత్తాలేవు. చాలని దానికి జారిపోతున్న పంచ ఒకటి. దాన్ని బిగపట్టుకుని పరుగెత్తడం కష్టసాధ్యమైపోతూ వుంది.

తన వస్తువులు, దుస్తులు తనకింక దక్కవని తేలిపోయింది. కాపాడుకోగలిగితే తన ప్రాణాలనైనా కాపాడుకోవాలి. ఎలా? ఎలా? ఏం చేయాలి? మల్లన్న సుడిగాలిలో ఎండుటాకులా కొట్టుకుపోతున్నాడు. పంచ, చొక్కా, కోటు అనేవి యింకా ఏ మేరకు తనను అంటిపెట్టుకుని ఉన్నాయో తెలియదు. శరీరంపైన ఎక్కడెక్కడ కోరలు దిగబడ్డాయో తెలియదు. అప్పుడతని అస్తిత్వమంతా ప్రాణభయమే అయిపోయింది. మృత్యువు క్రూర కర్కోటక భయంకర జాగిలరూపంతో తనను వెంటాడుతోందని తెలిసిపోయింది. కుక్క తనపైకి దూకినప్పుడల్లా క్రిందపడిపోయి కాళ్ళతో, చేతులతో దాన్ని విదిలించికొట్టడానికి విఫల ప్రయత్నాలు చేస్తే, పరుగెత్తబోయి గిరికీలు కొడుతూ, దిక్కులు తోచక హాహాకారాలు చేస్తూ ప్రాణాలు కాపాడుకోడం కోసం చేస్తున్న తీవ్ర ప్రయత్నంలో అతడు వెళ్ళి వెళ్ళి ఓ చెట్టు మొదలుకు ఢీకొన్నాడు. అట్లాగే దాన్ని అబ్బళించి పట్టుకుని, క్రింది నుంచి కుక్క తన పంచను దిగలాగి కాళ్ళంతా గాట్లు పెట్టేస్తున్నా ఆ బాధను భరిస్తూ ఎగబ్రాకాడు. శిశిరంలో ఆకులు రాలిపోయినట్టి కొమ్మలతో భారత నాటకంలో అర్జున వేషధారి ఎక్కే తపసుమానులా ఉన్న ఆ బాదంచెట్టు అతనికి ఆపద్బాంధవిలా దొరికిపోయింది. కుక్క కందనంత ఎత్తుకు వెళ్ళిపోయాక అక్కడొక కొమ్మపైన కూర్చున్నాడు. గుండె చిక్కబట్టుకుని, ఓపిక కూడదీసుకుని తన వైపు తాను చూచుకునేసరికి కోటులో ఒక పీలిక మాత్రం మెడ పట్టీలా వేలాడుతోంది. ఉన్నా, లేకున్నా ఒక్కటే నన్నంతగా చొక్కా విరూపమైపోయింది. నెత్తురు గాయాలవల్ల శరీరమంతా పచ్చి పుండులా వుంది. కట్టుకున్న పంచ క్రిందనేలపైన చెట్టు మొదట పడి వుంది. కుక్క మాత్రం చెట్టు చుట్టూ తిరుగుతూ, వుండి వుండి మోరపైకెత్తి మొరుగుతూ గస్తీకాస్తూనే వుంది.

అరగంటో, గంటో అలా గడిచిన తర్వాత కాంపౌండు గేటుగుండా మేడవైపు వస్తున్న ఒకతను - బహుశా నౌకరై వుండొచ్చు - ఎట్టఎదుటి సన్నివేశాన్ని చూస్తూ జరిగిన ఉదంతాన్ని ఊహించుకుని, నిలువుగుడ్లేసుకుంటూ కొంతసేపు స్తబ్ధుడై వుండిపోయాడు. ఆ తరువాత మౌనంగా లోపలికివెళ్ళి గొలుసు తీసుకొచ్చి కుక్కను లోపలికి పట్టుకెళ్ళిపోతూ 'ఓరి పిచ్చిముండావాడా! వెళ్ళిపో, వెళ్ళిపో' అన్నట్టుగా కళ్ళతోనే సైగ చేశాడు.

* * *

కాలం తెలివి మీరింది. కాదు కాదు, మనుషులే తెలివిమీరిపోయారు. తొండ మండలంలో మెడకాయపైన తలకాయ ఉన్న ప్రతి వ్యక్తికీ చదువుకోవాలన్న తిక్కపుట్టింది. చదువుకున్నకొద్దీ వాళ్ళకు తెలిసిన ప్రపంచం తాలూకు విస్తృతి పెరిగింది. మనిషి సాటి మనిషిపట్ల ఎట్లా వ్యవహరించాలన్న విషయం పట్ల వాళ్ళకు కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలు కలిగాయి. అందుకు సేగి కలిగినప్పుడు వాడబ్బ ఫాలాక్షుడినైనా సహించేది లేదని వాళ్ళు కూడబలుక్కున్నారు. ఈ సిద్ధాంతాన్ని తమ పెద్దలందరికీ నూరిపోశారు. క్రమక్రమంగా మహిడీ కాంపౌండులో అడుగు పెట్టేవాళ్ళు కరువైపోయారు. వాళ్ళ పొలాలు బీళ్ళు పడిపోయాయి. వాళ్ళకు ఊరి పైన రోత పుట్టింది. కాపురాలను ఏకంగా పట్నానికి తరలించి, ఉన్న డబ్బంతా వ్యాపారాల్లోకి పంపిణీ చేశారు. పల్లెలో తమ వ్యవసాయానికింక ఆటకట్టేనని తెలిసిపోవడంతో భూముల్ని అయినకాడికి తెగనమ్మేశారు. కానీ నివాస గృహంతో అలా తెగతెంపులు చేసుకునే వీలు లేకపోయింది. రాకపోకలు సల్పదానికి సైకిళ్ళు, స్కూటర్లు మొదలైనవి కొంటారేగానీ, ఏనుగుల్ని ఎవరు కొంటారు? మనుషులు లేని ఇల్లు ప్రాణంలేని శరీరం. చెత్తచిమ్మే వాళ్ళుండరు. బూజు దులిపే వాళ్ళుండరు. గోడకు వెల్లవేసేవాళ్ళుండరు. వచ్చిందీ, పోయిందీ రిపేరు చేసే వాళ్ళుండరు. చెట్లకు నీళ్ళు పోసేవాళ్ళుండరు. చాలని దానికి అర్ధాంతరంగా చనిపోయి (?) అక్కడ భూస్థాపితం చేయబడ్డ వ్యక్తులకు సంబంధించిన ఆత్మలు కొన్ని రాత్రి వేళల్లో ఆ మహిడీ చుట్టూ దయ్యాలై తిరుగుతున్నాయన్న పుకారొకటి ఎట్లాగో ప్రచారంలోకి వచ్చేసింది. అంతటితో ఆ పాతకాలపు భవంతికి భూతకళే పట్టేసింది. అయితే తొండ మండలంలో ఈ సాంఘిక పరిణామం గురించి మీకెవరూ చెప్పరు. గుండప్పమాడీ ఈ స్థితికి రావడానికి హేతువుగా వాళ్ళు నిష్కర్షగా చెప్పేది బుడబుక్కల మల్లన్న కథే! ఎటొచ్చీ గుడికి గోపురంలా ఆ కథకొక ముగింపు గూడా ఉండిపోయింది. అదేమిటంటే –

కొనవూపిరితో ఉన్న కళేబరంలా మెల్లగా చెట్టుపైనుంచీ కిందికి దిగివచ్చాడు మల్లన్న. శరీరం, వేషం, చూపులూ – అన్నీ అతణ్ణి పిచ్చివాణ్ణిగా నిరూపిస్తున్నాయి. తూలిపోతూ వంగి పంచపైకితీసి మొలకు చుట్టుకున్నాడు. చెట్టు కల్లంత దూరంలో క్రోటన్ మొక్కల మధ్య పడి ఉన్న వస్తువొకటి కనిపించేసరికి అతడికి పోయిన ప్రాణం తిరిగొచ్చి నట్టయింది. జీవనాధారమైన బుడబుడకలు చేతికందడంతో అతడు మిగిలిన తన వస్తువుల్ని గురించి ఆలోచించకుండా గేటు దాటుకుని 'నిషిద్ధ ప్రాంతం' నుంచీ బయటపడ్డాడు. అడ్డదారి వెంట ఊరి శివారులోకి వచ్చేశాడు. ఊరికి ఉత్తరంగా ఒక ఏరు. దానికటువైపున వల్లకాదు. ఏటిలో ప్రవహిస్తున్న చల్లటి నీటిని కడుపునిండుకూ పట్టించాడు. వల్లకాట్లో ముష్టిచెట్టు నీడన నిల్చున్నాడు. చితిలో నుంచీ ఓ గుప్పెడు దుమ్ము దీసి గుండప్ప మాడీవైపు గాలిలోకి వెదజల్లాడు. మల్లన్న చేతిలోని బుడబుడక ముక్కంటి చేతిలోని ఢమరుకంలా ఆ రుద్ర భూమిలో మ్రోగింది "తల్లీ కామాచ్చీ! నువు కంచిలో ఉండే మాట నిజమే అయితే, అమ్మా, మీనాచ్చీ! నువు మధురలో ఉండేమాట నిజమే అయితే, మహన్నభావురాలా విశాలాచ్చీ! నువు కాశిలో ఉండేమాట నిజమే అయితే గుండప్పమాడీలో దీపం పెట్టేదిక్కు లేకుండా పోవాల, మాడీ అడుగున జిల్లేల్లు మొలవాల, మాడీ కొప్పుమీద గూబ వాలాల, అంబ పలుకు, జగదంబా పలుకూ..."

♦ ఆంధ్రజ్యోతి, వారపత్రిక - 1990 ♦